ఐలమ్మ ఆశయాలు అందరికీ స్ఫూర్తిదాయకం


ఐలమ్మకు నివాళులు అర్పిస్తున్న అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: చాకలి ఐలమ్మ గొప్ప పోరాట యోధురాలు అని ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు పాలనాధికారి సుధీర్‌తో కలిసి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతాంగ సాయుధ ఉద్యమంలో వీర నారి ఐలమ్మ ముఖ్య భూమికను పోషించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు పాలనాధికారి సుధీర్, జిల్లా బీసీ సంక్షేమాధికారి ఉపేందర్, జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, పౌర సరఫరాల అధికారి మోహన్‌బాబు, ఈఈ ఉమేశ్‌కుమార్, డీపీఆర్‌ఓ చెన్నమ్మ పాల్గొన్నారు.

కుల్కచర్ల పీహెచ్‌సీ తనిఖీ


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పల్వన్‌కుమార్

కుల్కచర్ల, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలను అందించాల్సిన అవసరం ఉందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. పల్వన్‌కుమార్ పేర్కొన్నారు. కుల్కచర్ల మండల కేంద్రంలోని పీహెచ్‌సీని జాతీయ నాణ్యతా ప్రమాణాల రాష్ట్ర కన్సల్టెంట్ విజయలక్ష్మితో కలిసి గురువారం సందర్శించారు. పీహెచ్‌సీలో అందుతున్న సేవలు, రోజుకు ఎంత మంది రోగులు వస్తున్నారు? ఎలాంటి సేవలను అందిస్తున్నారు? రికార్డుల నిర్వహణ, పరిశుభ్రత, సిబ్బంది హాజరు తదితరాలను పరిశీలించి మాట్లాడారు. ఆసుపత్రికి మంచి పేరు తేవాలన్నారు.

వైద్యుల కొరత.. సేవలకు వెత


చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చి రోగులు

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

మరింత తీర్చిదిద్దాల్సిన జిల్లా ఆసుపత్రి

జిల్లాలో సుదీర్ఘ చరిత్ర కలిగి, చుట్టు పక్కల ప్రాంతాలకే కాదు, ఇరుగు పొరుగు రాష్ట్రాల రోగులకు సైతం వైద్య సేవలకు ఆధారంగా నిలుస్తోంది.. తాండూరు జిల్లా ఆసుపత్రి. కాలానుగుణంగా ఆధునిక వసతులతో మరింత ఉన్నతంగా వైద్య సేవలు అందించాల్సిన ఆసుపత్రి సిబ్బంది కొరత, సరిపోని సౌకర్యాలతో సమస్యలకు నిలయంగా మారుతోంది. ఈ పరిస్థితి నుంచి బయటపడేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని పేర్కొంటూ 'న్యూస్‌టుడే' కథనం. – న్యూస్‌టుడే, తాండూరు టౌన్.

జ్వర బాధితులే ఎక్కువ

నియోజక వర్గంలోని పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాలతో పాటు పట్టణ పరిధి, సరిహద్దు రాష్ట్రం కర్ణాటక, పొరుగు నియోజక వర్గం కొడంగల్ నుంచి నిత్యం 600 నుంచి 800 దాకా బయటి రోగులు వివిధ ఆరోగ్య సమస్యలపై వస్తుంటారు. వ్యాధుల నిర్ధారణ పరీక్షల కోసం 80 నుంచి 130 మంది దాకా వస్తారు. వీళ్లలో అధికంగా జ్వర బాధితులే ఉంటున్నారు. సెప్టెంబరు 1 నుంచి 25 దాకా 739 మంది ఆస్పత్రిలో చికిత్సలు పొందారు. వాళ్లలో జ్వరంతో వచ్చిన వారే 729 మంది ఉన్నారు.

వేధిస్తున్న ఖాళీల సమస్య

విభాగం..	ఉండాల్సింది..	ఉంది
ప్రత్యేక సివిల్ సర్జన్లు	13	4
డిప్యూటీ సివిల్ సర్జన్లు	9	2
సివిల్ సర్జన్	1	0
అసిస్టెంట్ సివిల్ సర్జన్లు	24	16

ఇదీ చరిత్ర: ఆసుపత్రి ఏర్పాటు.. 2001
రోజుకు ఓపీలో నమోదు.. 600 నుంచి 800
రోజుకు ఆసుపత్రిలో చేరేది.. 80 నుంచి 120
అందిస్తున్న వైద్య సేవలు.. డయాలసిస్, ఈఎన్‌టీ, డెంటల్, సిటీ స్కాన్

మొత్తం సిబ్బంది.. 182 | ప్రస్తుతం 135

పరికరాల కొరత

జిల్లా ఆస్పత్రిలో వైద్య పరికరాల కొరత సైతం ఇబ్బందిగా మారుతోంది. దంత పరీక్షల విభాగం, ఈఎన్‌టీ, మొబైల్ ఎక్స్‌రే యంత్రం, రోగ నిర్ధారణ పరీక్షల విభాగంలోనూ పరికరాలు అవసరం మేరకు అందుబాటులో లేవు. వీటితో పాటు ఫర్నిచరు సైతం ఇంకా సమకూర్చాల్సి ఉంది.



ప్రత్యేక పరీక్షలకు హైదరాబాద్‌కు..

సాధారణ రోగ నిర్ధారణ పరీక్షలు ఇక్కడే చేస్తున్నా థైరాయిడ్ వంటి కొన్ని ప్రత్యేక పరీక్షల కోసం మాత్రమే నమూనాలను హైదరాబాద్‌కు పంపిస్తున్నారు.

భర్తీ చేస్తే ఇబ్బందులు ఉండవు

ఆస్పత్రిలో వైద్య పరికరాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. ఇటీవలే ప్రభుత్వం బదిలీల ప్రక్రియలో చాలా మంది వైద్యులు, సిబ్బంది వెళ్లిపోయారు. వారి స్థానాల్లో భర్తీ చేయాల్సి ఉంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది, పరికరాలతో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం. – డాక్టర్ రవి శంకర్, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకుడు, తాండూరు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి


ఎమ్మెల్యేలు యాదయ్య, రామ్మోహన్‌రెడ్డిలకు జ్ఞాపిక అందజేస్తున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కె. చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చి పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తామని చేవెళ్ల, పరిగి ఎమ్మెల్యేలు యాదయ్య, టి. రామ్మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఓ వేడుక వేదికలో ఏర్పాటు చేసిన పీఆర్టీయూ జిల్లా కార్యవర్గ ఎన్నికల సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యేలు యాదయ్య, రామ్మోహన్‌రెడ్డిలకు కొత్తగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జ్ఞాపికను అందజేసి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు చెన్నకేశవరెడ్డి, పత్రిక సంపాదక వర్గ సభ్యులు ఇన్నారెడ్డి, ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన మహబూబ్‌నగర్, మేడ్చల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సన్మానించారు. ● పీఆర్టీయూ వికారాబాద్ జిల్లా అధ్యక్షునిగా కె. చంద్రశేఖర్ మూడో పర్యాయం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా అమర్‌నాథ్, గౌరవ అధ్యక్షునిగా వెంకట్రామిరెడ్డి ఎన్నికయ్యారు.

వరుస కట్టు.. దరఖాస్తు సవరణ చేపట్టు



యాలాల: గ్యాస్ రాయితీ రూ.500 అమలుకు లబ్ధిదారులకు ఇక్కట్లు తప్పడంలేదు. గురువారం అగ్గనూర్‌కు చెందిన వందమందికి పైగా లబ్ధిదారులు ఆన్‌లైన్లో నమోదు చేసుకోవడానికి గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వచ్చింది. ఎంపీఓ యాదయ్య లబ్ధిదారులకు నచ్చచెప్పి, మరో కంప్యూటర్‌లో వివరాలను నమోదు చేయించారు.

రుణమాఫీ చేయలేక సాకులు

నవాబ్‌పేట: పూర్తి స్థాయిలో రైతులకు రుణమాఫీ చేయలేక, సమాచారం సరిగా లేదంటూ ప్రభుత్వం తప్పించుకుంటోందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గురువారం భారాస జిల్లా అధ్యక్షుడు ఆనంద్, నాయకులతో కలిసి ఆమె మండల పరిధిలోని నారెగూడ గ్రామంలో పర్యటించారు. రచ్చబండ వద్ద రైతులతో మాట్లాడారు. తప్పులుంటే ఇదివరకు లావాదేవీలు ఎలా జరిగాయని ప్రశ్నించారు. అనంతరం కెనరా బ్యాంకు మేనేజర్ సునీల్‌ను పిలిపించి వివరాలు తెలుసుకున్నారు. రైతులతో మాజీ మంత్రి కేటీఆర్‌తో ఫోన్లో మాట్లాడించారు. ఎవరూ అధైర్య పడవద్దని, న్యాయం జరిగేంత వరకు మీ పక్షాన పోరాడుతామని హామీ ఇచ్చారు.

డీసీసీబీ డైరెక్టర్ల నియామకం

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: రంగారెడ్డి డీసీసీబీ నూతన డైరెక్టర్లుగా కుల్కచర్ల పీఏసీఎస్ ఛైర్మన్ కనకం మొగులయ్య, మాజీ డైరెక్టర్ కిషన్‌నాయక్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం అబిడ్స్ స్టేషన్ రోడ్డులోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో రంగారెడ్డి డీసీసీబీ ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన జరిగిన పాలకవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా కొత్తకుర్మ సత్తయ్య మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ కోటాలో డైరెక్టర్లు లేకపోవడంతో ఆ కోటాలో భర్తీ చేసేందుకు సభ్యులు తీర్మానించినట్లు వెల్లడించారు. సమావేశంలో వైస్ ఛైర్మన్ సంగం రవీందర్‌గౌడ్, డైరెక్టర్లు అంజిరెడ్డి, చంద్రశేఖర్, బాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, పోలీస్ రాంరెడ్డి, బూరుకుంట సతీష్, పీజీవీ రాణి, గుగులోతు సైదా హాజరయ్యారు.

పెట్రోల్‌కు బదులుగా నీళ్లు



పెద్దేముల్ మండలంలో పెట్రోల్‌కు బదులుగా నీళ్లు రావడంతో వాహనదారులు ఆశ్చర్యానికి గురయ్యారు. గురువారం మండలంలోని కందనెల్లి గ్రామ శివారులో గల ఓ పెట్రోల్ బంకులో పలువురు పెట్రోల్ పోయించుకున్నారు. కొద్ది దూరం వెళ్లాక వాహనాలు మొరాయించాయి. మెకానిక్‌ల వద్దకు తీసుకెళ్లగా పెట్రోల్‌కు బదులుగా నీళ్లు ఉన్నాయని తేలింది. దీంతో వినియోగదారులు పెట్రోల్ బంకు వద్దకు వచ్చి నిరసన తెలిపారు. గొడవ పెరగకుండా బంకు యజమానులు డబ్బులు ఇచ్చి పంపించారు. – న్యూస్‌టుడే, పెద్దేముల్.

బిల్లులు కోసం వినూత్న నిరసన



మనబడి పనులు పూర్తయినా బిల్లులు చెల్లించడం లేదని నిరసిస్తూ పరిగి నియోజకవర్గ పాఠశాలల ఛైర్మన్లు గురువారం ఉదయం పరిగిలోని అంబేడ్కర్ విగ్రహం ముందు ఉరితాళ్లు మెడలో వేసుకుని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హయాంలో అప్పులుచేసి పూర్తిచేసిన పనులకు ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు చెల్లించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. – న్యూస్‌టుడే, పరిగి గ్రామీణ.

భోజనంలో నాణ్యత తప్పనిసరి


విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

తాండూరుగ్రామీణ, తాండూరు టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులకు వడ్డించే భోజనంలో నాణ్యత తప్పనిసరి పాటించాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సూచించారు. తాండూరు మండలం ఖాంజాపూర్ గేటు వద్ద కొనసాగుతున్న తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని, సరకుల నిల్వ గదిలోకి వెళ్లి సామగ్రి నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అగ్ని ప్రమాదాలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి

మోమిన్‌పేట: వేడుక వేదికల్లో అగ్ని ప్రమాదాలను నివారించే చర్యలు విధిగా చేపట్టాలని వికారాబాద్ అగ్నిమాపక కేంద్రం అధికారి ధనుంజయ స్వామి నిర్వాహకులకు సూచించారు. గురువారం మోమిన్‌పేటలోని ఓ వేడుక వేదికలో అగ్ని ప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన పరికరాలను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించి వాటి నిర్వహణ తీరును తనిఖీ చేసి మాట్లాడారు.

మర్పల్లి పోలీసుల తీరు వివాదాస్పదం!

వికారాబాద్, మర్పల్లి, న్యూస్‌టుడే: గుర్తు తెలియని మృతదేహం మర్పల్లి మండలంలో ఇరు పార్టీల మధ్య చిచ్చుకు దారి తీసింది. ఈ నెల 24న మర్పల్లి పోలీస్‌ఠాణా ఎదుట కాంగ్రెస్- భారాస వర్గాలు మోహరించడంతో ఉద్రిక్తత నెలకొంది. పరస్పరం ఆరోపణలు, విమర్శలతో రాజకీయ రంగు పులుముకుంది. పోలీసుల అత్యుత్సాహమే ఈ ఘటనకు కారణమని పలువురు భావిస్తున్నారు. మృతదేహం ఎవరిదనేది పోలీసులు పరిశోధించి గుర్తించాలి. ఒక వేళ గుర్తిస్తే మరణోత్తర నివేదిక ఆధారంగా దర్యాప్తు చేయాలి. ఇదంతా ఏం చేయకుండానే, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించడం దారుణమని పేర్కొంటున్నారు.

అసలేం జరిగిందంటే..: మర్పల్లి మండలం పట్లూర్‌కు చెందిన మర్పల్లి రామప్ప(55)కు మతిస్థిమితం లేదు. గ్రామంలో సంచరిస్తూ, దాయాదుల వద్దకు వెళ్లి ఆకలి తీర్చుకునేవాడు. అతను 25 రోజులుగా కనిపించకుండా పోయాడు. ఎక్కడికో వెళ్లి ఉంటారని గ్రామస్థులు భావించడం, నా అనేవాళ్లు లేకపోవడంతో పోలీసులకు ఎవరూ ఫిర్యాదు చేయలేదు. ఈ నెల 20వ తేదీన పట్లూర్ శివారులో కుళ్లిపోయిన స్థితిలో ఓ గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు. అయితే ఈ కేసు విషయంలో ఈ నెల 24వ తేదీ తెల్లవారుజామున తమను పోలీసులు అదుపులోకి తీసుకుని కొట్టారని రామప్ప దాయాదులు మర్పల్లి ప్రవీణ్‌కుమార్, నవీన్‌కుమార్ ఆరోపించారు. రామప్పను హత్య చేసింది తామే అని అంగీకరించమని ఒత్తిడి తెచ్చారని బాధితులు వాపోయారు. జరిగిన విషయాన్ని భారాస నాయకులు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆనంద్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన మర్పల్లికి వెళ్లి కాంగ్రెస్ పాలనపై, స్పీకర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బాధితులు, శ్రేణులతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ప్రతిగా కాంగ్రెస్ శ్రేణులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరు వర్గాలను పోలీసులు నిలువరించారు. అనంతరం భారాస నాయకులు మర్పల్లి పోలీసుల వ్యవహారంపై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఇదే విషయాలను బాధితులు కేటీఆర్, సబితారెడ్డికి వివరించారు.

అక్రమ కేసులు పెడితే ప్రతిఘటిస్తాం: సబితారెడ్డి


బాధితుల ఇంటి నుంచి ఫోన్‌లో ఎస్ఐతో మాట్లాడుతున్న సబితారెడ్డి

వికారాబాద్, మర్పల్లి, న్యూస్‌టుడే: భారాస కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే, అండగా ఉండి ప్రతిఘటిస్తామని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీమంత్రి సబితారెడ్డి అన్నారు. గురువారం మర్పల్లి మండలం పట్లూర్ గ్రామానికి వెళ్లి కార్యకర్తలు ప్రవీణ్‌కుమార్, నవీన్‌కుమార్‌ను పరామర్శించారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కేసు విషయంలో వీరిని పోలీసులు అదుపులోకి తీసుకుని చితకబాదిన విషయం విదితమే. ఆమె వెంట మాజీ ఎమ్మెల్యే ఆనంద్, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ మధుకర్ ఉన్నారు. అనంతరం మర్పల్లి ఎస్సై సురేష్‌తో ఆమె ఫోన్‌లో మాట్లాడి పోలీసులు వ్యవహరించిన తీరును తప్పు పట్టారు. మండల భారాస అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు మధుకర్, నాయబ్‌గౌడ్, మోహన్‌రెడ్డి, రాచన్న తదితరులు పాల్గొన్నారు.

విరమణ ప్రయోజనం..అందక అవస్థలు

'సీసీఐ'లో రూ.2 కోట్ల గ్రాట్యుటీ బకాయిలు ● 6 సంవత్సరాలుగా కార్మికుల ఎదురుచూపులు


సీసీఐ వద్ద కార్మికులు

న్యూస్‌టుడే, తాండూరుగ్రామీణ:

కార్మికుడు లేదా ఉద్యోగికి పదవీ విరమణ అనంతరం గ్రాట్యుటీ చెల్లింపు అనేది సహజంగా జరిగేది. దీనికి నెలల సమయం కూడా తీసుకోకూడదు. కానీ ప్రభుత్వ రంగానికి చెందిన, తాండూరులోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)లో ఏకంగా 6 సంవత్సరాలుగా కార్మికులకు గ్రాట్యుటీ అందుతున్న దాఖలాలు లేవు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కానరావడం లేదని కార్మికులు వాపోతున్నారు.

కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలో ఏర్పాటు: తాండూరు మండలంలో తొలిసారిగా కరణ్‌కోటలో సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కర్మాగారాన్ని 1985 సంవత్సరంలో కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ నెలకొల్పింది. 300 మంది ఒప్పంద కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో ఏటా కొంత మంది కార్మికులు 58 సంవత్సరాలు నిండటంతో ఉద్యోగ విరమణ చేస్తున్నారు. మరికొందరు ఉద్యోగంలో ఉండగానే వివిధ కారణాలతో ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి వారికి కర్మాగార యాజమాన్యం గ్రాట్యుటీ సొమ్ము 6 సంవత్సరాలుగా చెల్లించకుండా దాటవేస్తుండటంపై తీవ్ర విమర్శలొస్తున్నాయి.

70 నుంచి 80 కుటుంబాల నిరీక్షణ

గతంలో 2012లో గ్రాట్యుటీ సొమ్ము చెల్లించకుండా యాజమాన్యం ఉండిపోయింది. ఏఐటీయూసీ కార్మిక సంఘం ఉద్యమించడంతో 2017 సంవత్సరంలో కార్మికులకు వడ్డీతో సహా చెల్లించింది. అప్పటి నుంచి ఆరు సంవత్సరాలుగా గ్రాట్యుటీ సొమ్ము మళ్లీ చెల్లించలేదు. 50 మందికిపైగా కార్మికులు ఉద్యోగ విరమణ చేయగా, మరో 25 మందికి పైగా మృతి చెందారు. వీరందరి కుటుంబాలకు కర్మాగారం రూ. 2.50లక్షల నుంచి రూ. 5లక్షల వరకు రూ. 2కోట్లకుపైగా గ్రాట్యుటీ సొమ్ము చెల్లించాల్సి ఉంది. కాలయాపన చేస్తుండటంతో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయి. అప్పులతో నెట్టుకొస్తున్నాయి.

కమిషనర్ ఆదేశించినా జాప్యమే..

గ్రాట్యుటీ సొమ్ము పొందేందుకు గత్యంతరంలేక ఇటీవల హైదరాబాద్‌లోని కేంద్ర కార్మిక శాఖ కమిషనర్‌ను ఆశ్రయించారు. కమిషనర్ కార్మికులందరికి బకాయి సొమ్ము చెల్లించేందుకు ఆదేశించారు. కానీ నేటికీ కదలిక రాలేదు.

పట్టించుకోవడం లేదు..

2018 నుంచి ఉద్యోగ విరమణ చేసిన, మృతి చెందిన కార్మిక కుటుంబాలకు 1972 చట్టం ప్రకారం గ్రాట్యుటీ చెల్లించడంలో యాజమాన్యం పట్టించుకోవడంలేదు. వెంటనే మంజూరు చేసి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలి. – శరణప్ప, సీసీఐ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ.

పనులు వేగవంతం..

● కొలిక్కి వస్తున్న గాజీపూర్ వంతెన అనుసంధాన నిర్మాణం

రాకపోకలు సులభతరం

న్యూస్‌టుడే, పెద్దేముల్:


రోడ్డుపై మట్టి చదును చేస్తున్న రోలర్

రహదారులు, వంతెనల నిర్మాణాలు సకాలంలో పూర్తయితే రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అధికారుల తాత్సారం, గుత్తేదారు నిర్లక్ష్యం తదితర కారణాలతో పనులు కొలిక్కి రాకపోతే వర్షాకాలంలో ప్రజల రాకపోకలు నిలిచి అవస్థలు పడాల్సి వస్తుంది. తాండూరు- సంగారెడ్డి మార్గంలో ఏళ్ల తరబడి ఇలాంటి పరిస్థితే నెలకొంది. సమస్యను స్థానికులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ప్రత్యేక చొరవ చూపి రోడ్డు నిర్మాణ పనులకు మార్గం సుగమం చేశారు.

మట్టిపోసినా కుంగిపోయింది

తాండూరు నుంచి సంగారెడ్డి వెళ్లే మార్గంలో గాజీపూరు, బుద్దారం వాగులపై వంతెనల నిర్మాణానికి 2016లో ప్రభుత్వం రూ.9 లక్షల నిధులను మంజూరు చేసింది. అప్పటి నుంచి నిర్మాణ పనులు సాగుతున్నాయి. బుద్దారం వాగుపై వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చారు. గాజీపూరు వాగుపై వంతెన పనులు మాత్రం ఒక అడుగు ముందుకు పడితే నాలుగు అడుగులు వెనక్కి అన్నట్లు సాగుతున్నాయి. వంతెన నిర్మాణ సమయంలో గుత్తేదారు చేతులు ఎత్తేశారు. మరో గుత్తేదారుకు అప్పగించారు. ఏడాది క్రితం వంతెన పనులు పూర్తి చేశారు. తాత్కాలికంగా మట్టిని పోసి రాకపోకలు సాగించే విధంగా చర్యలు తీసుకున్నారు. వర్షాలకు మట్టి దిగబడి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. శిథిలమైన పాత వంతెన పైనుంచి ప్రయాణాలు సాగాయి. భారీ వర్షాలకు ఆ వంతెన పైనుంచి సైతం రాకపోకలు నిలిపివేశారు.

అత్యవసర సమయంలో పడరాని పాట్లు

భూ సమస్య వల్ల వంతెన నిర్మాణ పనులు చాలా కాలం కొనసాగలేదు. దీంతో వానా కాలంలో వాగులు పొంగితే చాలు ప్రజలు ఇబ్బందులకు గురయ్యేవారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, ప్రమాదాలకు గురైన వారు సకాలంలో ఆసుపత్రులకు చేరలేకపోయారు. వాగుల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. తాండూరు నుంచి వివిధ ప్రాంతాలు రవాణా చేసే సిమెంటు, నాపరాయి లారీలు రోజుల తరబడి ఆగిపోయేవి. జాతీయ రహదారి 65కు ఈ మార్గం అనుసంధానం కావడంతో సరకు రవాణా చేసే వాహనాలు, వ్యాపారులు కూడా అవస్థలు పడేవారు.

ప్రస్తుతం గాజీపూరు వంతెన అనుసంధాన పనులు వేగంగా సాగుతున్నాయి. ఎత్తుగా ఉన్న వంతెనకు సమాంతరంగా మట్టిని పోసి చదును చేస్తున్నారు. సుమారు వంద మీటర్ల దూరం నుంచి మట్టితో కలుపు రోడ్డును వెడల్పు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు యంత్రాలతో తొక్కిస్తూ మట్టిని గట్టిపరుస్తున్నారు. కింది నుంచి వెళ్లే మార్గాన్ని పూర్తి తొలగించారు. మట్టి గట్టి పడగానే కంకర పనులు చేయనున్నారు. దానిపై తారు వేసి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తారు.

సార్వత్రిక పరీక్షలకు ఏర్పాట్లు చేయండి


వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో జరిగే సారస్వతిక (ఓపెన్) ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు పాలనాధికారి సుధీర్ అన్నారు. గురువారం ఆయన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ అక్టోబర్ 3 నుంచి 9 వరకు జిల్లాలో ఈ పరీక్షలు జరుగనున్నాయని తెలిపారు. పదో తరగతి విద్యార్థుల కోసం స్థానిక జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలను, ఇంటర్ విద్యార్థుల కోసం స్థానిక జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలను కేంద్రాలుగా ఏర్పాటుచేశామన్నారు. ఉదయం 9.30నుంచి 12 గంటల వరకు తిరిగిమధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని అన్నారు. జిల్లా విద్యాధికారిణి రేణుకాదేవి, విద్యుత్తు శాఖ ఎస్ఈ సంజీవ్ రెడ్డి, పాల్గొన్నారు.

ఆర్ఐపై చర్యలు అవసరం

యాలాల: యాలాల ఆర్ఐ చరణ్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి మల్కయ్య పేర్కొన్నారు. గురువారం యాలాల ఎమ్మార్వో కార్యాలయం ఆవరణలో నిరసన తెలిపి ఎమ్మార్వో అంజయ్యకు అన్నసాగర్ గ్రామస్థులతో కలిసి మల్కయ్య వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. అన్నసాగర్ గ్రామానికి చెందిన రేషన్ డీలర్ అంతర్జాలంలో తమ కుటుంబాల పేర్లు తీసివేశారని తెలిపాడని గ్రామస్థులు వాపోయారు. ఈ విషయమై గత నెలలో కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా అదనపు కలెక్టర్ జిల్లా పౌరసరఫరాల అధికారికి నివేదికను పంపారన్నారు. వారు తిరిగి ఎమ్మార్వో కార్యాలయం నుంచి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేయగా ఇప్పటి వరకు ఆర్ఐ నివేదికను ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని వివరించారు.

దర్శనీయం.. తీర్చిదిద్దితే పర్యాటకం

విశేషాల వేదికగా ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాలు



ఆనందం, ఆహ్లాదం సొంతం చేసుకునేందుకు నచ్చిన ప్రదేశాన్ని సందర్శిస్తుంటారు. సంస్కృతి, సంప్రదాయ, ఆధ్యాత్మిక వారసత్వ కట్టడాలు, జల వనరులు, ప్రాజెక్టులు, అటవీ ఇతర ప్రాంతాలు.. ఎన్నో పర్యాటకంగా ఆదరణ పొందుతున్నాయి. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లోనూ ఎన్నో ప్రాంతాలు పేరొందాయి. పెరుగుతున్న జనాభా, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సందర్శనీయ ప్రాంతాలను సుందరీకరించాలని జిల్లావాసులు కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తే ప్రజలకు ఆహ్లాదం, ప్రభుత్వానికి ఆదాయం పెరగడం ఖాయం. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

అభివృద్ధి అవశ్యం

గజ్వేల్: 50 టీఎంసీల సామర్థ్యంతో గజ్వేల్-దుబ్బాక నియోజకవర్గాల మధ్య నిర్మించిన కొమురవెల్లి మల్లన్నసాగర్‌ను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు గతంలో ప్రతిపాదనలు పంపించగా కార్యరూపం దాల్చలేదు. 23 కి.మీ. పొడవుతో నిర్మించిన భారీ ఎత్తున కట్ట, ఒక పక్క కొండలు, చెట్లతో ఆహ్లాదం పంచే ఈ ప్రాజెక్టును చూసేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి సందర్శకులు వస్తున్నారు. సౌకర్యాల కరవుతో సందర్శకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మత్స్య సంపద, ప్రాజెక్టు చెంతన పచ్చని పొలాలు, ప్రకృతి రమణీయత ఉట్టిపడే ఇక్కడి అందాలను తనివితీరా చూడవచ్చు. జలాశయం వద్ద వసతుల కల్పనతో ఆదాయం ఖాయం.



చరిత్ర ఆనవాళ్లు పదిలం

కొండాపూర్: శాతవాహనుల కాలంలో వెలిగిన కొండాపూర్‌లో నేలమాళిగల అవశేషాలెన్నో లభ్యమయ్యాయి. అప్పటి నాణేలు, ఆభరణాలు కూడా బయల్పడ్డాయి. గొప్ప బౌద్ధ క్షేత్రంగా విలసిల్లినట్టు ఆధారాలెన్నో ఉన్నాయి. ఆదిమానవుల ఆనవాళ్లూ తవ్వకాల్లో బయల్పడ్డాయి. రాతి యుగం నాటి పనిముట్లు లభించాయి. వాటితో మ్యూజియం ఏర్పాటుచేశారు. సందర్శకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలి. భోజనశాల ఏర్పాటు చేస్తే బాగు.



మొసళ్ల అభయారణ్యం

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలం కల్పగూరు శివారులో మంజీర జలాశయాన్ని 1978లో వన్యప్రాణి అభయారణ్యంగా గుర్తించారు. ఇక్కడ 580 మొసళ్లు ఉన్నట్లు అధికారుల లెక్క. మొసళ్ల సంతాన వృద్ధి కేంద్రం కూడా ఇక్కడ ఉంది. రాంసర్ సైట్‌గా గుర్తింపునకు ప్రతిపాదనలు పంపారు. ఆమోదిస్తే జాతీయ స్థాయిలో గుర్తింపు రానుంది. సందర్శకులకు అన్ని వసతులు కల్పించాలి. చిన్నారులు ఆడుకునేలా ఏర్పాట్లు చేయాలి. పార్కును విస్తరించాలి.

'సాగర్'ను తీర్చిదిద్దితే..



సిద్దిపేట: సిద్దిపేట సమీపంలో 3 టీఎంసీల సామర్థ్యంతో రంగనాయక సాగర్‌ను నిర్మించారు. దీని మధ్య ద్వీపం (45 ఎకరాలు) ప్రత్యేక ఆకర్షణ. జలాశయం చుట్టూ 8.65 కి.మీ. కట్ట తీర్చిదిద్దారు. నిత్యం 200 మంది వరకు సందర్శిస్తున్నారు. పర్యాటకులకు వసతులు కరవయ్యాయి. ప్రత్యేక నిర్మాణాలు లేవు. ప్రి వెడ్డింగ్, లఘుచిత్రాలు, ఇతర వాటికి వేదికైంది. సైక్లింగ్ పోటీలకు అనువైన వాతావరణం ఉంది. పర్యాటక ధామంగా అభివృద్ధికి గతేడాది రూ.125 కోట్లు వెచ్చించి పనులు ప్రారంభించగా, అవి నిలిచిపోయాయి. వీటిని పూర్తిచేస్తే ఉమ్మడి జిల్లా, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, హైదరాబాద్ నుంచి పర్యాటకులు వచ్చే అవకాశం ఉంది.


జిల్లాల సరిహద్దులో..



పోచారం వన్యప్రాణి అభయారణ్యం

మెదక్, హవేలిఘనపూర్: మెదక్, కామారెడ్డి జిల్లాల సరిహద్దులో ఉన్న పోచారం అభయారణ్యం, పోచారం ప్రాజెక్టు వద్ద సరైన వసతులు కరవయ్యాయి. వారాంతం, సెలవు రోజుల్లో 500 మందికిపైగా వస్తున్నారు. ప్రాజెక్టుకు వెళ్లేందుకు మట్టి దారే ఉంది. దాన్ని బాగు చేయాలి. తాగునీటి వసతి కల్పించాలి. బోటింగ్ సౌకర్యం సైతం లేదు. శిథిలావస్థలో ఉన్న పురాతన కట్టడాలను బాగు చేయించాలి. కొన్నాళ్ల కిందట ప్రతిపాదించినా ఆమోదముద్ర పడలేదు.

రూపు మారిస్తేనే..



మెదక్, పాపన్నపేట: మెదక్ జిల్లాలో ప్రసిద్ధ ఏడుపాయల వనదుర్గమ్మ పుణ్యక్షేత్రానికి ఏటా రూ.7 కోట్ల ఆదాయం సమకూరుతోంది. ప్రస్తుతం 45 వరకు సత్రాలు ఉన్నాయి. దాత సాయంతో ఒక తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేశారు. నిత్యం వెయ్యి మందికిపైగా దర్శించుకుంటున్నారు. భక్తుల సౌకర్యార్థం కాటేజీలు నిర్మించాలి. సేదతీరేలా పెద్దహాల్ మాదిరిగా నిర్మించాలి. పార్కింగ్ స్థలాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటిపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

సేదతీరేలా..



ధారూర్: వికారాబాద్ జిల్లా కేంద్రానికి కోట్‌పల్లి ప్రాజెక్టు 20 కి.మీ. దూరంలో ఉంటుంది. అనంతగిరి అనంతపద్మనాభ స్వామిని దర్శించుకొని ఇక్కడికి వస్తుంటారు. వారాంతాల్లో 500 మందికిపైగా సందర్శిస్తున్నారు. సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. తాగునీరు, కూర్చునేందుకు, సేదతీరడానికి బెంచీలు ఏర్పాటు చేయాలి. పార్కు, పిల్లలు ఆడుకునేలా వస్తువులు అందుబాటులోకి తీసుకొస్తే బాగు. ప్రాజెక్టులో బోటింగ్ సౌకర్యం మాత్రమే ఉంది. ఈత కొలను ఏర్పాటుకు డిమాండ్ ఉంది.

బాల మణిపూసలు

సాహిత్యంలో కవిత్వానిది కీలక పాత్ర. సామాజిక అంశాలను సరళ పదాలతో వ్యక్తపరిచి ఆలోచింపజేయడం కవిత్వం ప్రత్యేకత. తెలుగు భాషపై కొంత పట్టు ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. ఈ విషయాన్ని గ్రహించారు తెలుగు ఉపాధ్యాయుడు వడిచర్ల సత్యం. విద్యార్థి దశలోనే తెలుగు కమ్మదనాన్ని తెలియపరిచి వారిలో ఆసక్తిని పెంచేందుకు కృషి చేశారు. భాషపై మమకారాన్ని పెంచి.. వారితో అక్షర సుమాలను పేర్చించారు. ఉపాధ్యాయుడి సంకల్పాన్ని అందుకున్న చిన్నారులు నిరంతర సాధన చేసి అక్షరాలకు హారతి పట్టారు. వారే బషీరాబాద్ మండలం గొట్టిగట్టు ఉన్నత పాఠశాల విద్యార్థులు. 51 మంది చిన్నారులు రాసిన 450 కవితలు 'గొట్టిగట్టు మణిపూసలు' పేరిట గ్రామ పెద్దలు, ఉపాధ్యాయుల సహకారంతో పుస్తక రూపం దాల్చాయి. ఆరు నుంచి పదోతరగతి చిన్నారులు ఇందులో భాగస్వామ్యం అయ్యారు. ఎమ్మెల్యే బయ్యని మనోహర్‌రెడ్డి పుస్తకాన్ని శుక్రవారం ఆవిష్కరించనున్నారు. వడిచర్ల సత్యం ఇప్పటి వరకు 12 పుస్తకాలకు పైగా రాశారు. ఈ సారి విద్యార్థులతో రాయించడమే లక్ష్యంగా ముందుకు సాగారు. - న్యూస్‌టుడే, పాత తాండూరు, బషీరాబాద్



రాసిన పుస్తకాలతో విద్యార్థులు

చిన్నారులతో రాయించడం సంతృప్తినిచ్చింది: వడిచర్ల సత్యం

నేను రాయడం కంటే నావద్ద చదువుకున్న విద్యార్థులంతా కవితలు రాసి, వినిపించడం సంతృప్తినిచ్చింది. వాటిని ఒక చోట చేర్చి, పుస్తకంగా రూపొందించాం. తెలుగు భాష ఉన్నతికి, బాలల్లో భాషా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు కృషి చేయాలన్నదే నా ధ్యేయం.

16 ఏళ్లకు పండగ

● ఉమ్మడి మెదక్ జిల్లాలో 292 మందికి దక్కనున్న ఉద్యోగాలు



ఉమ్మడి రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీ-2008 అభ్యర్థుల విషయమై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎట్టకేలకు ఊరట లభించింది. డీఈడీ అభ్యర్థుల కన్నా మెరిట్ ఉన్న బీఈడీ అభ్యర్థులను ఒప్పంద పద్ధతిలో సెకండరీ గ్రేడ్ టీచర్లు(ఎస్జీటీ)గా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 24న సదరు నిర్ణయం తీసుకోగా.. సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయంతో అప్పటి అభ్యర్థులకు ఒప్పంద కొలువులు దక్కనున్నాయి. దీని వల్ల ఉమ్మడి జిల్లాలో 292 మంది ప్రయోజనం పొందనున్నారు.

30 శాతం మేర..

డీఎస్సీ 2008 నియామకాల చివరి నిమిషంలో 30 శాతం పోస్టులను డీఈడీ అభ్యర్థులకు కేటాయించడంతో బీఈడీ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారు. డీఈడీ అభ్యర్థుల కన్నా ఎక్కువ మార్కులు వచ్చినా ఉద్యోగాలు రాలేదు. తమకు అన్యాయం జరిగిందంటూ నష్టపోయిన వారంతా అప్పట్లో ఆందోళనకు దిగారు. అప్పటి నుంచి న్యాయ పోరాటం చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో 292 మందికి ఉద్యోగాలు దక్కనుండటం విశేషం.

27 నుంచి పరిశీలన..

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ తీసుకున్న నిర్ణయంతో 16 ఏళ్ల తర్వాత ఒప్పంద ఉపాధ్యాయ కొలువులు దక్కనున్నాయి. వీరికి నెలకు రూ.31,030 చొప్పున వేతనం చెల్లించనున్నారు. కొలువులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఉమ్మడి జిల్లాల వారీగా డీఈవో కార్యాలయాల్లో విడుదల చేశారు. వాటిలో పేర్లున్న అభ్యర్థులు ఈ నెల 27 నుంచి వచ్చే నెల 5 వరకు జరిగే ధ్రువపత్రాల పరిశీలనకు సిద్ధం అవుతున్నారు. విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచిన వెరిఫికేషన్ పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. జాబితాల్లో పేర్లున్న వారిలో కొందరు ఇప్పటికే ఇతర ఉద్యోగాలు చేస్తున్నారు. మరికొందరు ఇతర రంగాలు, వృత్తుల్లో స్థిరపడ్డారు. మరి ఇప్పుడు ఎంత మంది ఒప్పంద ఎస్జీటీ ఉపాధ్యాయులుగా చేరుతారో అన్నది వేచి చూడాలి. ఇదిలా ఉండగా వీరిని ఏ పాఠశాలలకు కేటాయిస్తారు, ప్రస్తుతం జిల్లాలో ఖాళీగా ఉన్న ఎస్జీటీ పోస్టుల్లో నియమిస్తారా, లేదా ప్రత్యేక పోస్టులేమైనా సృష్టిస్తారా అన్నది తేలాల్సి ఉంది.

– న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం

వేడుకలకు చర్చి ముస్తాబు

చర్చి ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్ఐ) కూటమి, స్త్రీ మైత్రి సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ సీఎస్ఐ చర్చిలో ఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు (శుక్రవారం) నిర్వహించే ఈ వేడుకలకు మెదక్ డయాసిస్ పరిధిలోని ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి రానున్నారు. డిప్యూటీ మాడరేటర్, మెదక్ ఇన్‌ఛార్జి బిషప్ డా.కె. రూబెన్ మార్క్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వీధుల్లో ర్యాలీ, చర్చి ప్రాంగణంలో సీఎస్ఐ, స్త్రీ మైత్రి సంఘం పతాకాల ఆవిష్కరణ, అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేపట్టనున్నారు.



చర్చి ప్రాంగణంలో వేదిక ఏర్పాటు

ఆసుపత్రికి పూర్వవైభవం: సుమారు 20 ఏళ్ల కిందట వైద్య సేవలు అందించి మూతబడిన మెదక్ సీఎస్ఐ మిషన్ ఆసుపత్రికి పూర్వవైభవం రానుంది. బిషప్ బంగ్లా వెనుకాల కొనసాగిన ఈ ఆసుపత్రి నేడు చర్చి ప్రధాన ద్వారం వద్ద నిర్మించిన భవనంలో ప్రారంభించనున్నారు. భక్తుల కోసం ఏర్పాట్లు చేశామని ప్రెసిబేటరీ ఇన్‌ఛార్జి శాంతయ్య, చర్చి కమిటీ కోశాధికారి గంట సంపత్ తెలిపారు. - న్యూస్‌టుడే, మెదక్ అర్బన్


డ్రోన్‌తో గాలించినా దొరకని షాకీర్ ఆచూకీ



గాలింపు చర్యలను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: జహీరాబాద్ మండలం బూచినెల్లి వద్ద నారింజ వాగులో గల్లంతైన షాకీర్ కోసం పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ శివలింగం, తహసీల్దార్ రవీందర్ పర్యవేక్షణలో గురువారం తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని వాగు పరీవాహకం పొడవునా డ్రోన్ సాయంతో గాలింపు చేపట్టిన ఆచూకీ లభ్యం కాలేదు. నారింజ ప్రాజెక్టుతో పాటు కర్ణాటకలోని బరూర్, హుగ్రానా, కంటానా శివార్లలో కురిసిన కుండపోత వర్షాలకు వాగులో వరద తగ్గుముఖం పట్టడం లేదు. గ్రామస్థుల సాయంతో గజ ఈతగాళ్లతో పాటు యువకుల సాయంతో వెతికినా ఫలితం లేకపోయింది. గాలింపు చర్యల్లో సమస్యలపై అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో శుక్రవారం ఎన్‌డీఆర్ఎఫ్ బృందాన్ని రప్పించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వాగు ఉద్ధృతంగా పారడంతో జహీరాబాద్-ఘనపూర్ మార్గాన్ని పూర్తిగా మూసివేశారు. రాకపోకలు నిలిపివేశారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



నిజామొద్దీన్

పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: మూడు రోజులుగా కనిపించని ఓవ్యక్తి అనుమానాస్పద స్థితిలో చెరువులో శవమై కనిపించాడు. ఈ సంఘటన పరిగి మండల పరిధిలోని రాఘవాపూర్‌లో గురువారం జరిగింది. ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు. మహ్మద్ నిజామొద్దీన్ (47) అవివాహితుడు. వ్యవసాయపనులు చేస్తూ... గ్రామంలో ఒంటరిగా ఉంటున్నాడు. మూడు రోజులుగా కన్పించలేదు. గురువారం స్థానికులు రాఘవాపూర్ చెరువు పరిసరాల్లోకి వెళ్లగా చెరువు ఒడ్డున అతడు వేసుకునే దుస్తులు, టవల్, చెప్పులు, ఇంటి తాళం చెవులు కనిపించడంతో ఆందోళనకు గురయ్యారు. చెరువులో దూరంగా శవంలా కనిపించడంతో అనుమానంతో కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై రమేష్, సిబ్బందితో కలిసి ఒడ్డుకు చేర్చారు. పోస్టుమార్టం నిమిత్తం పరిగి సామాజిక ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం



రాజు

దోమ, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన దోమ మండలం దిర్సంపల్లిలో చోటుచేసుకుంది. దిర్సంపల్లికి చెందిన బొల్లం రాజు(28) కుటుంబం పొలం దగ్గరే ఇల్లు నిర్మించుకొని నాలుగేళ్లుగా నివాసం ఉంటున్నారు. వ్యవసాయానికి సరఫరా చేస్తే నియంత్రిక (బుడ్డీ) నుంచి ఇంట్లోకి కరెంటు లాగారు. బుధవారం రాత్రి ఇంట్లోకి సరఫరా లేక చీకటి పడింది. దీంతో నియంత్రికలోని లివర్‌ను ఇనుపపైపుతో సరిచేసే ప్రయత్నం చేయబోయాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడే పడిపోయాడు. తండ్రి అంజిలయ్య, భార్య స్వప్న గుర్తించి సీపీఆర్ విధానంలో కాపాడే ప్రయత్నం చేశారు. అదే రోజు రాత్రి కారులో వికారాబాద్ మిషన్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులతో పాటు భార్య కన్నీరుమున్నీరుగా విలపించారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	125–00	డ్రెస్డ్	213–00
రిటైల్	147–00	స్కిన్‌లెస్	243–00

చిన్నారిని లాలించి.. ఆప్యాయత చాటి..



చిన్నారిని లాలిస్తున్న మంత్రి కొండా సురేఖ

మెదక్, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ఓ చిన్నారిని లాలించి తన ఆప్యాయతను చాటారు. జిల్లా కేంద్రం మెదక్‌లో ఆరు గ్యారంటీల అమలుపై జరిగిన సమీక్షలో పాల్గొనేందుకు కలెక్టరేట్‌లోకి వెళ్తుండగా ఆరుబయట ఓ సీనియర్ మహిళా కానిస్టేబుల్ చేతిలో పసిబిడ్డను చూసి వెంటనే కాన్వాయ్ ఆపారు. ఆమె వద్దకు వెళ్లి ఎండగా ఉండటంతో చిన్నారికి నీటిని తాగించి వివరాలు ఆరా తీశారు. బాబు తల్లి సైతం తనతో పాటు విధులు నిర్వర్తిస్తున్నారని కానిస్టేబుల్ చెప్పింది. దీంతో బాబు తల్లి.. కానిస్టేబుల్ శ్రీలతను పిలిపించి మాట్లాడారు. వారిద్దరినీ తనతో పాటు కాన్వాయ్‌లో కలెక్టరేట్‌లోకి తీసుకెళ్లారు. పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి ఆ మహిళా కానిస్టేబుల్ పరిస్థితిని వివరించి మరోచోట డ్యూటీ వేయాలని ఆదేశించారు.

● చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని ఆమె పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని, ఆ స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించాలనే సంకల్పంతో హైదరాబాద్ కోఠిలోని మహిళా యూనివర్సిటీకి ఆమె పేరు పెట్టామని తెలిపారు. కలెక్టరేట్‌లో మొక్క నాటి నీళ్లు పోశారు. వనమహోత్సవంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యేలు మైనంపల్లి రోహిత్ రావు, సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి, కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎల్ఈడీ దీపాల తయారీపై శిక్షణ

సిద్దిపేట, న్యూస్‌టుడే: జిల్లా ఎన్‌జీసీ (నేషనల్ గ్రీన్ కోర్) విభాగం ఆధ్వర్యంలో సిద్దిపేటలోని ఇందిరానగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎల్ఈడీ దీపాల తయారీపై గురువారం కార్యశాల నిర్వహించారు. 50 పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు తయారీ విధానంపై నేర్పించారు. ఎన్‌జీసీ జిల్లా సమన్వయకర్త భాస్కర్ నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించగా.. హైదరాబాద్ నుంచి ప్రోగ్రాం అధికారి రాజశేఖర్ హాజరై శిక్షణ అందించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులకు ధ్రువపత్రాలు ప్రదానం చేశారు.



తయారీపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

రాత్రి చదువు.. ఇంటికి వెలుగు



పంచగామలో రాత్రి చదువుకుంటున్న విద్యార్థినులు

ఆసక్తి ఉండాలే కానీ ఏ సమయంలోనైనా చదువుకోవచ్చు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ప్రాంతంలో ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు. రాత్రి వేళ చదువు మరింత విస్తరిస్తోంది. మండలంలోని ర్యాకల్ జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల సూచనలతో సమయం వృథా చేయకుండా ఈ దిశగా అడుగేయడం గమనార్హం. ఇక్కడి తెలుగు ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ దీనికి బీజం పోశారు. ర్యాకల్, పోతన్‌పల్లి గ్రామాల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులు 157 మంది నిత్యం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు ఇలా చదివి సత్ఫలితాలు సాధించారు.

స్ఫూర్తి అందిపుచ్చుకొని..

చంద్రశేఖర్ ఇటీవలి ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా ఖేడ్ జడ్పీ ఉన్నత పాఠశాలకు వచ్చారు. తోటి ఉపాధ్యాయుల సహకారంతో ఇక్కడ సైతం రాత్రి చదువు అమలుకు శ్రీకారం చుట్టారు. ఇక్కడ ఖేడ్ పురపాలికతో పాటు సమీప 45 గ్రామాలకు చెందిన 900 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఉపాధ్యాయుల చొరవతో మూడు నెలలుగా 8 గ్రామాల్లో రాత్రి చదువు కొనసాగుతోంది. మరోవైపు ఈ స్ఫూర్తిని అందిపుచ్చుకొని ఖేడ్ మండలం రుద్రారం, కంగ్టి మండలం తర్కవడగామ ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు సైతం దీన్ని పాటిస్తుండటం విశేషం. మరిన్ని చోట్ల రాత్రి చదువుకు ఉపాధ్యాయులు.. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.

దాతల సహకారం

విద్యార్థులు రాత్రి సమయం వృథా చేయకుండా చదువుపై దృష్టి పెట్టడంతో పలువురు దాతలు తమ సహకారం అందించేందుకు ముందుకొస్తున్నారు. గతేడాది ర్యాకల్ ఉన్నత పాఠశాలలో 157 మందికి శాంతా డెవలపర్స్ యజమాని దుప్పట్లు అందజేశారు. పిల్లలకు ఉపయోగపడేలా నిత్యం పాఠశాల ప్రారంభానికి ముందు గంటపాటు స్పోకెన్ ఇంగ్లీష్ తరగతి నిర్వహించారు. బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్ పది విద్యార్థులకు రోజూ సాయంత్రం అల్పాహారం అందించారు. ఖేడ్ మండలం పీర్లతండాకు చెందిన ఐఆర్ఎస్ అధికారి సుధాకర్‌నాయక్ పాఠశాలలో గ్రంథాలయంతో పాటు స్టడీ సెంటర్ ఏర్పాటు చేయించారు.

- న్యూస్‌టుడే, నారాయణఖేడ్

పదేళ్లుగా పరాయివాళ్లం: కోదండరాం



ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానిస్తున్న ప్రతినిధులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: పదేళ్ల భారాస పాలనలో మనమంతా సొంత రాష్ట్రంలోనే పరాయివాళ్లుగా మిగిలిపోయామని ఎమ్మెల్సీ కోదండరాం ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నాళ్లూ ఒక్కరి చేతిలోనే పాలన సాగడం దురదృష్టకరమన్నారు. సిద్దిపేటలోని ఎన్జీవోస్ భవన్‌లో తెలంగాణ ఉద్యమకారుల వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆత్మీయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యమకారుల సమస్యలకు పరిష్కారం దొరకలేదని, వాటిపై చర్చకు వేదిక అవసరమని, విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. తెలంగాణలో నానాటికీ నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్ తెలంగాణ నిర్మాణం కోసం చిత్తశుద్ధితో పనిచేద్దామని ఉద్ఘాటించారు. అనంతరం తమ ఉద్యోగాలను కొనసాగించాలని కోరుతూ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగభద్రత కోసం జూనియర్ కళాశాలల అతిథి అధ్యాపకులు, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిగ్రీ కళాశాలల ఒప్పంద అధ్యాపకులు వినతిపత్రాలు అందజేశారు. వేదిక ప్రతినిధులు పరమేశ్వర్, పెద్దిరాజు, అందె ప్రవీణ్, విక్రమ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కనకచంద్రం, కొండి మల్లారెడ్డి, అయిత అంజయ్య, బాపురావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు అనారోగ్యంతో బాధపడుతున్న ఉమ్మడి మెదక్ జిల్లా ఐకాస మాజీ ఛైర్మన్ డా.పాపయ్యను పరామర్శించారు.

అవయవదానంతో మరొకరికి పునర్జన్మ



డా.రవి సుందర్‌ను సన్మానిస్తున్న ఉస్మానియా వైద్యులు

హైదరాబాద్, న్యూస్‌టుడే: అవయవదానంతో ఇతరులకు పునర్జన్మ ప్రసాదించవచ్చని ఉస్మానియా వైద్యకళాశాల ప్రిన్సిపల్ డా.నరేందర్‌కుమార్ అన్నారు. అవయవదానంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జీవన్మృతుడు నుంచి సేకరించిన అవయవాల ద్వారా ఇద్దరికి కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమన్నారు. గురువారం ఆసుపత్రిలో పర్యవేక్షకుడు డా.రాకేశ్ సహాయ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడారు. ఉస్మానియా వైద్యుల అభ్యర్థన మేరకు అవయవదానంపై రోగుల సహాయకులకు అవగాహన కల్పించేందుకు ట్రాన్స్‌ప్లాంట్ కో-ఆర్డినేటర్ ఏర్పాటు విషయమై ప్రభుత్వానికి విన్నవిస్తామన్నారు. ఆసుపత్రి సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాధిపతి డా.సీహెచ్.మధుసూదన్, డా.మనీషా సహాయ్ (నెఫ్రాలజీ), డా.ఎన్.నాగప్రసాద్ (ప్లాస్టిక్ సర్జరీ), డా.మల్లికార్జున్ (యూరాలజీ), డా.చంద్రశేఖర్(అనస్థీషియా) తదితరులు మాట్లాడారు. ఇద్దరికి కాలేయ మార్పిడి, నలుగురికి మూత్రపిండాల మార్పిడి, నలుగురికి కార్నియా మార్పిడి, కాలిన గాయాలకు గురైన వారికి అతికించేందుకు చర్మం అతికించేందుకు అవయవాలు సేకరించినట్లు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన నరేందర్(46)కు ఈ నెల 18న కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించారు.

వీరనారి ఐలమ్మ సేవలు స్ఫూర్తిదాయకం



చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ నీరజ ప్రభాకర్, అధికారులు

ములుగు, న్యూస్‌టుడే: వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను గురువారం ములుగు, మర్కూక్ మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ములుగు ఉద్యాన విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి వీసీ నీరజ ప్రభాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఐలమ్మ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మండల పరిధిలోని మామిడ్యాల కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఐలమ్మ చిత్రపటానికి రజక సంఘం మండలాధ్యక్షుడు రాజు, ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ భూపాల్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కానుకలు వెనక్కి!

● పంపిణీ చేయని చీరల్ని పంపిస్తున్న కార్యదర్శులు

న్యూస్‌టుడే, పూడూరు: జిల్లాలో అధికారులు గత ఏడాది పంపిణీ కోసం తెప్పించిన బతుకమ్మ చీరలు చాలా చోట్ల మిగిలాయి. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో కార్యదర్శులు ముందస్తుగా అంచనాలు వేసుకుని వాటిని తెప్పించుకున్నారు. రెవెన్యూ శాఖ పర్యవేక్షణలో రేషన్ డీలర్ల ద్వారా మహిళలకు అందించే ఏర్పాట్లు చేశారు. అదే ఏడాది దసరా నెలలోనే శాసనసభ ఎన్నికల కోసం ఎన్నికల కమిషన్ నుంచి ప్రకటన విడుదల చేయడంతో పంపిణీకి అడ్డంకులు వచ్చాయి. అధికారులు, సిబ్బంది మొత్తం ఎన్నికల హడావుడిలో పడ్డారు. జిల్లాలోని కొడంగల్, పరిగి, తాండూరు, వికారాబాద్ నియోజక వర్గాల పరిధిలో 8లక్షల చీరలు అందించాల్సి ఉండగా చాలా చోట్ల పంపిణీలో జాప్యం జరిగింది. దీంతో పూడూరు మండలంలోని గ్రామాల్లో దాదాపు 6 వేలు మిగిలి పోయాయి. జిల్లాలో సుమారు ఒక లక్షకు పైగానే కానుకలు మిగిలినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మిగిలిన చీరలు ఇప్పటివరకు గ్రామ పంచాయతీల్లో ఉంచగా వాటిని వాపస్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు తమవద్ద ఉన్న లెక్కప్రకారం తీసుకువచ్చి మండల పరిషత్ కార్యాలయంలో అప్పగిస్తున్నారు.



పూడూరు ఎంపీడీవో కార్యాలయానికి తెచ్చిన బతుకమ్మ చీరల సంచులు

ఇస్తారా.. ఇవ్వరా?

ఈసారి ప్రభుత్వం మారటంతో దసరా పండుగకు ముందు మహిళలకు బతుకమ్మ కానుకలు ఇస్తారా? ఇవ్వరా? అనేది ఇంకా స్పష్టత రాలేదు. వచ్చేనెల 2 నుంచి బతుకమ్మ సంబురాలు ప్రారంభం కానున్నాయి. ఇంకా వారం రోజులు కూడా సమయం లేకపోవడంతో అంతా అయోమయానికి గురవుతున్నారు. కొత్తగా డిజైన్‌లు మార్చి ఇస్తారని కొందరు, చీరలకు బదులు నగదు రూపంలో సహాయం ఇస్తారని మరికొందరు చెప్పుకొంటున్నారు. చీరలు ఇచ్చేది ఉంటే ఇప్పటికే మండల పరిషత్తు కార్యాలయాలకు చేరుకునేది. గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సమాచారం ఉండేది.

తెప్పించుకుంటున్నాం: పాండు, ఎంపీడీవో, పూడూరు


గత ఏడాది మిగిలి పోయిన బతుకమ్మ చీరలను వాపస్ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో అన్ని పంచాయతీల నుంచి తెప్పించుకుంటున్నాం. ఈసారి ఏవైనా డిజైన్‌లు మార్చి ఇస్తారా? లేదనేది ఇంకా మాకు సమాచారం లేదు. ఒకవేళ నగదు రూపంలో సహాయం అందిస్తారనేది కూడా తెలియటం లేదు. వాపస్ తీసుకున్న చీరలను జిల్లా కార్యాలయానికి పంపిస్తాం.

విపణి లేక.. వీధి వ్యాపారాలు

ఇబ్బందుల్లో తాండూరు వాసులు

న్యూస్‌టుడే, తాండూరు: జిల్లాలో వ్యాపార, వాణిజ్య పట్టణంగా పేరున్న తాండూరులో నిర్మించ తలపెట్టిన సమీకృత విపణి అర్ధాంతరంగా ఆగిపోయింది. పట్టణంలోని 71,008 జనాభా అవసరాలకు అనుకూలంగా కూరగాయలు, మాంసం, గుడ్లు, కిరాణాసామగ్రి, చేపలు, పువ్వులు, పండ్లు తదితర సరకులు ఒకే చోట లభించాలనే ఉద్దేశంతో 3ఎకరాల్లో సమీకృత విపణి నిర్మాణానికి రెండేళ్ల కిందట ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనికి రూ. 7.50 కోట్లను మంజూరు చేసింది. విపణిలో మొత్తం 323 దుకాణాలను నిర్మించేందుకు ప్రారంభమైన పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. చేసేది లేక చిరు వ్యాపారులు కూరగాయలను రోడ్ల వారగా గొడుగులను ఏర్పాటు చేసుకుని విక్రయిస్తున్నారు. చేపలు, మాంసం ఎక్కడ పడితే అక్కడ విక్రయిస్తున్నారు. పండ్లు తోపుడు బండ్లపై విక్రయాలు జరుగుతున్నాయి. సమీకృత విపణి స్థానే వెజ్, నాన్ వెజ్ విక్రయాలకు సంబంధించిన దుకాణాలను పట్టణంలోని సీతారాంపేటలో నిర్మించాలని ప్రభుత్వం తాజాగా తలపెట్టింది. గడచిన ఆగస్టులో రూ. 3.43 కోట్లతో పనులు చేపట్టేందుకు నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు టెండర్ పూర్తి కాలేదు. దీంతో పట్టణ ప్రజలకు అన్ని రకాల సరకులు ఒకే చోట కొనుగోలు చేసే విపణి లేక పోవడంతో ఒక్కో వస్తువు కొనుగోలుకు ఒక్కో చోటకు వెళ్లడంలో ఇబ్బందులు తప్పడం లేదు.


రైల్వేస్టేషన్ రోడ్డులో గొడుగుల కింద కూరగాయలు విక్రయిస్తున్న చిరువ్యాపారులు


ఆగిపోయిన సమీకృత విపణి పనులు

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్‌టౌన్: 80742 74587
తాండూరు టౌన్: 80085 73260
పరిగి : 80085 73272
కొడంగల్: 94403 34770
(10 AM TO 1 PM)

న్యూస్‌టుడే, కుల్కచర్ల గ్రామీణ: ? చాకల్‌పల్లి తండాకు వెళ్లే రోడ్డంతా గుంతలమయంగా మారింది. రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. చాలా రోజులుగా ఈ సమస్య ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. – శంకర్, స్థానికుడు

✔ రోడ్డు గుంతలమయంగా మారిందనేది వాస్తవమే. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేలా చూస్తాం.

– మైమూదాబేగం, పంచాయతీ కార్యదర్శి

న్యూస్‌టుడే, తాండూరు టౌన్: ? మిత్రానగర్ కాలనీలో మురుగు కాల్వలు పూర్తి స్థాయిలో లేక ఇబ్బందులు పడుతున్నాం.

– వెంకట్, తాండూరు

✔ కాల్వలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకుంటాం. –విక్రమ సింహారెడ్డి, పురపాలక సంఘం కమిషనరు తాండూరు

న్యూస్‌టుడే, దౌల్తాబాద్: ? మండలకేంద్రం నుంచి లింగయ్యబావి మీదుగా నందారం వెళ్లే లింకు రోడ్డు మధ్యలో వాగుపై వంతెన నిర్మించాలి. రైతులకు, నీటూరు, కౌడీడ్, నందారం గ్రామాల వాసులకు రవాణా పరంగా ఎంతో సౌలభ్యం ఉంటుంది. – వీరన్న, దౌల్తాబాద్

✔ వాగులపై వంతెనల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు వచ్చిన వెంటనే నిర్మాణాలు చేసేలా చర్యలు తీసుకుంటాం. –రవికిరణ్, పంచాయతీరాజ్ ఏఈ, దౌల్తాబాద్.

నీటిని తొలగిస్తేనే పత్తికి మేలు

దోమ, న్యూస్‌టుడే: పత్తి చేలో నీరు నిల్వ ఉండకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఏరువాక కేంద్రం తాండూర్ కో-ఆర్డినేటర్లు లక్ష్మన్, యమునలు పేర్కొన్నారు. గురువారం పరిగి మండలం, యాచారం, దోమ మండలం బుద్లాపూర్, బ్రాహ్మణపల్లిలో పంటల సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పత్తి, వరి తదితర పంటలకు సోకే తెగుళ్ల నివారణ గురించి తెలిపారు. పత్తిలో నీటినిల్వతో వచ్చే వడలు తెగులు లక్షణాలను వివరించారు. కార్యక్రమంలో ఏడీఓ లక్ష్మీకుమారి, రజిత, ఏఓ ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

కుల్కచర్ల, న్యూస్‌టుడే: ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువవుతున్నాయని వాటితో ఎంతో మంది మోసానికి గురవుతున్నారని ఎస్బీఐ ఆర్ఎం పల్లంరాజు అన్నారు. కుల్కచర్ల మండల కేంద్రంలోని ఎస్బీఐని ఆయన సందర్శించారు. అనంతరం ఆయన ఖాతాదారులతో మాట్లాడారు. బ్యాంకులు ఖాతారుల నుంచి ఓటీపీలను అడుగదన్న విషయాన్ని గమనించాలని చెప్పారు.

నందారంలో మంచినీరు వృథా

కొడంగల్, దౌల్తాబాద్, న్యూస్‌టుడే: నందారంలో తాగునీరు వృథాగా పోతోంది. వేసవిలో తాగునీటికి ఎంతో కష్టాలు పడుతున్నామని తెలిసినా.. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా ఈ విధంగా నీరు అవుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి బోరు నుంచి నేరుగా నీరంతా వృథాగా పోతోంది. అక్కడ జలభాండాగారం ఏర్పాటు చేయకపోవంతో ఈ దుస్థితి ఏర్పడిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పూడూరులో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి


కుల్కచర్లలో..


తాండూరులో.. పురపాలక సంఘం అధ్యక్షురాలు స్వప్న, నాయకులు

ఐలమ్మకు ఘనంగా నివాళి

పోరాట యోధురాలు ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఐలమ్మ త్యాగాలను కొనియాడారు. ఆమె ఉద్యమ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కుల్కచర్లలో ఆమె జీవిత చరిత్రపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను ఏర్పాటు చేసి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందించారు.

తాండూరు టౌన్: తాండూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పురపాలక సంఘం అధ్యక్షురాలు స్వప్న, ప్రజాప్రతినిధులు, రాజకీయ, కుల సంఘాల నాయకులు ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో వ్యవసాయ విపణి అధ్యక్షుడు పట్లోళ్ల బాల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాజుగౌడ్, కౌన్సిలర్లు సోమశేఖర్, పట్లోళ్ల నీరజ, రజక సంఘం నాయకులు కృష్ణ, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


చెంగోల్‌లో విగ్రహం వద్ద నాయకులు, గ్రామస్థులు


తాండూరు టౌన్: నివాళులు అర్పిస్తున్న బీసీ నాయకులు

అపరిశుభ్రంగా ప్రాంగణం


పెద్దేముల్: రైతులకు వ్యవసాయ సాగు విధానంపై సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన వేదిక రైతువేదిక. వీటిల్లో పారిశుద్ధ్యం పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంటోంది. వేదికల్లోకి అడుగు పెట్టగానే కంపు కొడుతోంది. వివిధ అవసరాలకు వెళ్తున్న రైతులు దుర్వాసన భరించలేకపోతున్నారు. పక్షులు రెట్ట వేయడంతో గదులన్నీ ఇబ్బందికరంగా మారాయి.

పైవంతెనపై గుంతలు


వికారాబాద్‌టౌన్: జిల్లా కేంద్రం వికారాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు ఒకే పై వంతెన ఉంది. కొద్దీ రోజులుగా కురుస్తున్న వర్షాలకు దానిపై గుంతలు పడ్డాయి. దీంతో వచ్చిపోయే వాహనదారులకు ఇబ్బందిగా మారింది. సంబంధిత శాఖ ఈఈ శ్రీధర్‌రెడ్డిని 'న్యూస్‌టుడే' సంప్రదించగా వర్షాలు తగ్గుముఖం పట్టాక గుంతలను సరి చేసి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చేస్తామని తెలిపారు.

పోషకాహారంతో శిశువుకు ఆరోగ్యం

వికారాబాద్ మున్సిపాలిటీ: గర్భిణులు, బాలింతలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందజేయాలని వికారాబాద్ ప్రాజెక్టు అధికారిణి వెంకటేశ్వరమ్మ, తహసీల్దారు లక్ష్మీనారాయణ అన్నారు. శివారెడ్డిపేట ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమంలో మాట్లాడారు. ఎక్కువ పోషక విలువలు ఉన్న ఆహారాన్ని ఇవ్వటం వల్ల పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా పుడతారన్నారు.. మెప్మా పట్టణ అధికారి వెంకటేశం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, నిర్మల, జరీనా, నరసమ్మ, శాంత, కళావతి, గీత పాల్గొన్నారు.

గుర్రం దాడి.. ఒకరికి తీవ్రగాయాలు

బషీరాబాద్, న్యూస్‌టుడే: గుర్రం దాడి చేయడంతో ఒకరికి గాయాలైన సంఘటన బషీరాబాద్ మండలం జీవన్గీలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం జెట్టూరుకు చెందిన గూడ్‌సాబ్ కొంత కాలంగా గుర్రాన్ని పెంచుతున్నాడు. రెండు రోజుల క్రితం గుర్రం ఇంటినుంచి వెళ్లిపోయింది. వెతకడానికి జీవన్గీకి వచ్చాడు. ఊరి శివారులోని ఓ పొలం వద్ద గుర్రం కనిపించడంతో అక్కడికి వెళ్లాడు. దీంతోపాటు మరొకటి పొలం వద్ద మేత మేస్తున్నాయి. తన గుర్రాన్ని తీసుకెళ్లే ప్రయత్నం చేయగా మరో గుర్రం ఈయనపై దాడి చేసి రక్తగాయాలు చేసింది. గమనించిన జీవన్గీ గ్రామస్థులు చికిత్స నిమిత్తం తాండూరుకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

కల్తీ టీ పొడి స్వాధీనం

కుల్కచర్ల, న్యూస్‌టుడే: వాహనాలను తనిఖీ చేస్తుండగా విక్రయానికి తీసుకుపోతున్న కల్తీ టీ పొడి పట్టుబడిన సంఘటన కుల్కచర్ల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్ఐ అన్వేష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కుల్కచర్లలో వాహనాలను తనిఖీ చేస్తుండగా బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి వద్ద నిండుగా ఉన్న రెండు బ్యాగ్‌లు కనిపించాయి. అనుమానంతో పరిశీలించగా గండేడ్ మండల కేంద్రానికి చెందిన సురేష్ అందులో 60 కిలోల కల్తీ టీ పొడిని కుల్కచర్లలో విక్రయానికి తీసుకువస్తున్నట్లు వెల్లడైంది. ఆయనకు నగరానికి చెందిన వెంకటప్రసాద్ టీ పొడిని సరఫరా చేస్తున్నాడని, అక్కడ కూడా దాడులు నిర్వహించడంతో అతని వద్ద 2 క్వింటాళ్ల టీ పొడి లభ్యమైందని చెప్పారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అన్వేష్‌రెడ్డి వివరించారు.

15 మందిపై కేసు నమోదు

బషీరాబాద్, న్యూస్‌టుడే: బషీరాబాద్ మండలం మైల్వార్, నీళ్లపల్లి అటవీ ప్రాంతంలో అక్రమంగా భూములను చదును చేసుకుంటున్న వారిని గుర్తించిన అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇస్మాయిల్‌పూర్‌కు చెందిన 15 మంది వివరాలతో బషీరాబాద్ ఠాణాలో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అటవీ భూమిలో ప్రవేశించిన వ్యక్తిపై ఫిర్యాదు

ధారూర్: అటవీ భూమి చుట్టూ తీసిన కాలువను పూడ్చి చెట్లను తొలగించి పొలానికి బాట వేసుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గురువారం ధారూర్ డిప్యూటీ రేంజ్ అధికారిణి హేమ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీన్లో పేర్కొన్న వివరాల ప్రకారం రాంపూర్ తండా సమీపంలోని సోలార్ ప్లాంట్ దగ్గర అటవీ భూమిలోకి ఎవరూ రాకుండా కాలువ తీసి అందులో వెదురు చెట్లు నాటారన్నారు. ఈ నెల 23న పెట్రోలింగ్‌లో భాగంగా అక్కడికి వెళ్లి చూడగా పక్క పొలం రైతు రవీందర్ కాలువను పూడ్చి చెట్లను తొలగించి పొలానికి బాట చేసుకున్నాడని అందులో పేర్కొన్నారు. వీరిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు.

దస్త్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

మోమిన్‌పేట: దస్త్రాల నిర్వహణలో నిర్లక్ష్యం చేయకూడదని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ గ్రామాల కార్యదర్శులకు సూచించారు. గురువారం మండల పరిషత్తు కార్యాలయంలోని సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ఉపాధి హామీ దస్త్రాలను పరిశీలించి మాట్లాడారు. ఎలాంటి సమాధానం రాకుంటే చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీవో యాదగిరి అధికారులు దత్తు, సరళ, రమేష్, ఏపీవో శంకర్ పాల్గొన్నారు.

బస్సుల కొరత తీర్చాలని ఏబీవీపీ రాస్తారోకో

చేవెళ్ల: బస్సుల కొరత కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కళ్లెం సూర్య ప్రకాష్ అన్నారు. గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు చేవెళ్లలో ర్యాలీ తీసి బీజాపూర్ రహదారిపై రాస్తారోకో చేశారు.

వయోవృద్ధుల సమస్యలపై సంప్రదించండి


క్యారం ఆడుతూ..

వికారాబాద్‌టౌన్, న్యూస్‌టుడే: వృద్ధులకు మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అన్ని వసతులను కల్పించామని ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి వెంకటేష్ అన్నారు. గురువారం వికారాబాద్ పట్టణ పరిధి కొత్తగడి సమీపంలో ఉన్న మినిస్ట్రీ వృద్ధాశ్రమంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని ఆటల పోటీల్లో భాగంగా క్యారంబోర్డు, చదరంగం, కుర్చీలాట, అంత్యాక్షరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏవైనా సమస్యలు వస్తే టోల్‌ఫ్రీ నంబరు 14567కు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు సంప్రదించవచ్చాన్నారు.

సాయి మందిరంలో ఆరోగ్య పరీక్షలు

పూడూరు, న్యూస్‌టుడే: పూడూరు సాయి మందిరంలో గురువారం ఉచిత వైద్యశిబిరం జరిగింది. సాయి ఓరల్ హెల్త్ ఫౌండేషన్, ఎమ్మెస్‌రెడ్డి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో నేత్రాలు, దంతాలు, సాధారణ పరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి మందులు పంపిణీ చేశారు. కంటికి శస్త్ర చికిత్సలు అవసరమున్న 11 మందిని గుర్తించి నగరానికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, నరేందర్, సుధా సిబ్బంది నాగమణి, సత్యనారాయణ ఉన్నారు.

కాలువ తవ్వి వదిలేశారు

మర్పల్లి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని దామస్తాపూర్‌లో మురుగు కాలువల నిర్మాణం కొరకు నెల రోజుల కిందట ఇళ్ల మధ్యన కాలువ తవ్వారు. ఆ తర్వాత పనులు నిలిపివేశారు. ఈ కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆటో చోదకులు అటువైపు వెళ్లాలంటే ఇబ్బంది అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసంపూర్తి పనులు పూర్తి చేయాలని ప్రజా ప్రతినిధులు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆవేదన చెందుతున్నారు.

మూడు కిలోమీటర్లు.. ముచ్చెమటలు!

నిధులు మంజూరైనా పూర్తికాని సంగెంకలాన్-మల్కాపూర్ రహదారి

న్యూస్‌టుడే, తాండూరుగ్రామీణ

గనుల గ్రామాలకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. సర్కారు నిధులు మంజూరు చేసినప్పటికీ అధికారులు రహదారుల నిర్మాణానికి చర్యలు చేపట్టకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. సంగెంకలాన్-మల్కాపూర్ రహదారి కేవలం మూడు కిలోమీటర్లే ఉన్నా.. పూర్తి చేయకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

తాండూరు ప్రాంతంలో నాపరాయి గనులు అత్యధిక విస్తీర్ణంలో ఉన్నాయి. ప్రధానంగా మల్కాపూర్, సంగెంకలాన్ పరిసరాల్లో వందల ఎకరాల్లో నిక్షేపాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 300 ఎకరాలకుపైగా తవ్వకాలు చేపట్టారు. విలువైన ఖనిజ సంపదతో సర్కారుకు, గ్రామాలకు ఆదాయం సమకూరుతోంది. కానీ ఆయా గ్రామాలకు అనుసంధానంగా ఉన్న తారు రహదారి అధ్వానంగా మారింది. భారీ వర్షాలకు తారు రహదారి కొన్నిచోట్ల అమాంతం కొట్టుకు పోయింది. రహదారి నిర్మాణానికి ఎదురు చూపులు మిగిలాయి. నిత్యం పదులసంఖ్యలో నాపరాళ్ల ఎగుమతులు చేసే మార్గంలో వాహనదారులు, ప్రయాణికులు, వ్యాపారులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే గ్రామం నుంచి తాండూరు కీలక ప్రజా ప్రతినిధులు ఉన్నారు. వారు దృష్టిసారించి రహదారి నిర్మించాలని గ్రామస్థులు, నాపరాయి వ్యాపారులు కోరుతున్నారు.



ఉపాధికి భరోసా..

గుంతలుపడి దెబ్బతిన్న సంగెంకలాన్-మల్కాపూర్ రహదారి నిర్మించేందుకు ప్రభుత్వం రూ.1.87 కోట్లు మంజూరు చేసింది. వీటితో రెండు గ్రామాలకు అనుసంధానంగా మూడు కి.మీ. తారు రహదారి నిర్మించేందుకు ఖరారు చేశారు. రహదారులు భవనాల శాఖ అధికారులు టెండరు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. రహదారి నిర్మాణ పనులు పూర్తి చేసే బాధ్యతల్ని దక్కించుకునేందుకు ఎస్ఎస్ఆర్ సంస్థ ముందుకొచ్చింది. ఇటీవల వర్షాలు తగ్గుముఖం పట్టాయి. పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. రహదారి పనులు పూర్తైతే గనుల గ్రామాల ప్రయాణం సాఫీగా సాగనుంది. నాపరాయి ఎగుమతులు మరింత జోరుగా సాగనున్నాయి. దీంతో వ్యాపారులకు ఆదాయం సమకూరడంతోపాటు కార్మికుల ఉపాధికి భరోసా లభించనుంది.

త్వరలో నిర్మిస్తాం - శివకుమార్, డీఈ, రహదారులు భవనాల శాఖ, తాండూరు

సంగెంకలాన్-మల్కాపూర్ రహదారి నిర్మాణానికి నిధులు సిద్ధంగా ఉన్నాయి. టెండరు ద్వారా ఒప్పందం చేసుకున్న గుత్తేదారుతో పనులు ప్రారంభించేందుకు ఆదేశిస్తాం. రెండు నెలల్లో కొత్త రహదారిని అందుబాటులోకి తీసుకువస్తాం.

బాధ్యతలు స్వీకరించిన విద్యాధికారులు

దోమ: దోమ మండలం బొంపల్లి ప్రధానోపాధ్యాయుడు వెంకట్ దోమ మండల విద్యాధికారిగా ఇన్‌ఛార్జి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన హరిశ్చందర్ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని బాలానగర్‌కు బదిలీపై వెళ్లారు. గురువారం పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నూతన ఇన్‌ఛార్జి ఎంఈవోను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

మోమిన్‌పేట: మండల విద్యా అధికారిగా బి.మల్లేశం గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండల ఇన్‌చార్జి ఎంఈవోగా నవాబ్‌పేట మండల విద్యాధికారి గోపాల్ విధులు నిర్వర్తించారు.

పూడూరు: పూడూరు మండల విద్యాధికారిగా సాయిరెడ్డి గురువారం బాధ్యతల్లో చేరారు. ఇంతకు ముందు పనిచేసిన హరిశ్చందర్ బదిలీ కావటంతో పూడూరు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న సాయిరెడ్డిని అధికారులు ఇన్‌ఛార్జి ఎంఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

చౌడాపూర్(కుల్కచర్ల): కొత్తగా ఏర్పడిన చౌడాపూర్ మండలంలో తొలి విద్యాధికారిగా బాధ్యతలు తీసుకున్న రామచంద్రయ్య విద్యాభివృద్ధికి కృషి చేయాలని మండల భాజపా నాయకులు బాలరాజుగౌడ్ అన్నారు. మండల విద్యాధికారిగా ప్రభుత్వం పదోన్నతిని కల్పించిన దరిమిలా.. ఆయన్ను సత్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో స్థానికులు ప్రవీణ్, నరేష్, మహేష్, వెంకటేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్, కొడంగల్, బొంరాస్‌పేట: దౌల్తాబాద్‌కు గోకపస్లావాద్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్‌స్వామి, బొంరాస్‌పేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిలాల్, దుద్యాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయరామారావుకు ఆయా మండలాల విద్యాధికారులుగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

పెద్దేముల్: మండల విద్యాధికారిగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు నర్సింగ్ రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

వికారాబాద్, మర్పల్లి: ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించి రహదారి ప్రమాదాల నివారణకు సహకరించాలని వికారాబాద్ ఎస్సై శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని బీజేఆర్, ఎన్టీఆర్ చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు అన్ని పత్రాలు ఉండాలని తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

కుల్కచర్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రభులు అన్నారు. చౌడాపూర్ మండల కేంద్రంలో పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు నాగరాజుయాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్పాటి అశోక్ తదితరులతో కలిసి లబ్ధిదారులకు గ్యాస్ రాయితీ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.


రాయితీ పత్రాలను అందజేస్తున్న తహసీల్దార్

వర్షానికి కుప్పకూలిన నివాసం

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: ఇటీవల నుంచి కురుస్తున్న వర్షాలకు తాండూరులో ఓ ఇల్లు కూలింది. పట్టణంలోని ఇందిరానగర్ హామాలీ బస్తీ ప్రాంతానికి చెందిన మల్లప్ప నివాసం ఇది వరకే శిథిలావస్థకు చేరింది. రెండు రోజులుగా కురుస్తున్న వానలకు పైకప్పుతో పాటు గోడలు తడిసి పోయాయి. గురువారం ఒక్కసారిగా పైకప్పు కూలి పడింది. ఇంట్లో ఎవరు లేక పోవడంతో ప్రమాదం తప్పింది.


కూలిన ఇంటి పైకప్పు